అవగాహనే ఆయుధం..

- లింగ నిర్ధారణ నిషేధిత చట్టం పటిష్టతకు చర్యలు
- చైతన్యం చేసే దిశలో అడుగులు
- క్షేత్ర స్థాయిలో విస్తృత ప్రచారాలు



చొప్పెల్ల పీహెచ్‌సీలో గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆలమూరు: నేటి ఆధునిక సమాజంలోనూ మనుస్మృతి, సనాతన ధర్మం అంటూ విష ప్రచారం జరుగుతున్నప్పటికీ..వివక్ష, అణిచివేత వారిలోని ప్రతిభను నిలువరించలేక పోతున్నాయనేది నిర్వివాదాంశం. భారతీయ సమాజంలో స్త్రీకి ఆర్థిక స్వావలంబన ఇంకా పూర్తిగా లభించలేదు అంటారు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్. సగభాగంగా ఉన్న స్త్రీలకు అంతే మొత్తంలో రాజకీయ, ఆర్థిక స్వావలంబన పెరిగినప్పుడే సమానత్వం, సాధికారత సాకారమౌతుంది. ప్రస్తుత ఆధునిక యుగంలో ఆడ, మగ జాతికి తేడా లేదు ఎవరైనా ఒక్కటే అన్న భావన అందరిలోను క్రమంగా నెలకొంటుంది. మహిళలకు మాతృత్వం దేవుడిచ్చిన వరమని అందరూ భావిస్తారు. సాంకేతికతతో కూడిన చికిత్స విధానాన్ని అసరాగా తీసుకుని కొన్ని స్కానింగ్ సెంటర్లు, వైద్యుల దురాశ వల్ల గర్భంలోనే శిశువు ఉండగానే లింగ నిర్ధారణ చేస్తున్నారు. ఇంకా ఈనవ సమాజం పట్ల అవగాహన లేని మూఢ నమ్మకం కలిగిన వారు పురాతన కాలం నాటి సాంఘిక దురాచారం, విష సంస్కృతిని అవలంభిస్తూ భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారు.

అట్టడుగున భారత్

లింగ సమానత్వం మన దేశంలో చాలా అధ్వానంగా ఉంది. ప్రపంచ దేశాలతో పోల్చుకుంటే భారత్ ఎక్కడో అట్టడుగున ఉండటం కలవరపరిచే అంశం. గ్లోబర్ జెండర్ గ్యాప్ ఇండెక్స్‌ను వరల్డ్ ఎకనామిక్ ఫోరం విడుదల చేసింది. ఈ నివేదికలో 156 దేశాలకు చెందిన సమాచారాన్ని పొందుపరిచారు. లింగ సమానత్వంలో భారత్ 28 స్థానాలు పడిపోయి 140 వ స్థానానికి చేరుకున్నది. కరోనా మహమ్మారి కారణంగా అసమానత పెరిగినట్లు నివేదిక పేర్కొన్నది.

చట్టాన్ని పటిష్టం చేయాలి

సమాజంలో లింగ వివక్షను రూపు మాపేందుకు వీలుగా 1994లో అప్పటి కేంద్ర ప్రభుత్వం గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ (పీసీపీఎన్‌డీటీ) చట్టం ప్రవేశపెట్టింది. ఈ చట్టం సక్రమంగా అమలు చేసేందుకు వీలుగా అధికారులు క్రమం తప్పకుండా జిల్లా ఉన్నతాధికారులు, వైద్యాధికారులు క్షేత్ర స్థాయిలో తరచూ అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి లింగ వివక్షను నిర్మూలించేందుకు కృషి చేస్తున్నారు. పుట్టబోయే బిడ్డ ఆడ అయినా, మగ అయినా ముద్దులొలికే చిరునవ్వుగా భావించాలని చెబుతున్నారు. కడుపులోని బిడ్డ లింగ నిర్ధారణ కోసం ఉపయోగిస్తే పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రకారం నేరమవుతుందని హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ సమాజంలో మార్పు రావడం లేదు.

పరిస్థితి ఇలా..

క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో 23 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మూడు సామాజిక ఆరోగ్య కేంద్రాలతో పాటు సుమారు 25 ప్రసూతి ఆసుపత్రులు ఉన్నాయి. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి, కపిలేశ్వరపురం, మండపేట, ఆలమూరు, కొత్తపేట సీహెచ్‌సీలలో ప్రస్తుతం స్కానింగ్ పరికరాలున్నాయి. ప్రస్తుతం పలు ఆస్పత్రుల్లో టెక్నిషియన్లు లేకపోవడంతో ఆ పరికరాలు నిరూపయోగం మారాయి. రావులపాలెం, కొత్తపేట తాటిపాక, పి.గన్నవరం, మలికిపురం ప్రాంతాల్లో సుమారు పది వరకూ స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి. భ్రూణ హత్యలు నేర మంటూ జిల్లా పేరిట వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మూడు నెలలకు ఒకసారి స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయడం కొంతమేర ఉపశమనం కలిగిస్తుంది.

చట్టాన్ని ఉల్లంఘిస్తే..

ప్రభుత్వం నుంచి లైసెన్స్‌లు పొందిన స్కానింగ్ సెంటర్లు నిబంధనలను అధిగమించి అల్ట్రా సౌండ్ వైద్య పరీక్షలను లింగ నిర్ధారణకు ఉపయోగించడం చట్టరీత్యా నేరమని గుర్తించి లైసెన్స్‌లు రద్దు చేస్తామని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. లింగ నిర్ధారణకు సిఫారసు చేసిన వైద్యులు, స్కానింగ్ నిర్వాహకులపై కేసు నమోదు చేసే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. నేరం రుజువైతే మూడేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధించే అవకాశం ఉంది. స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ చేస్తున్నట్లు తెలిస్తే 18004 53365 టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేశారు.

సద్వినియోగం చేసుకోవాలి



మాతా శిశు సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వ ఆసుపత్రులు పని చేస్తున్నాయి. ప్రతి నెలా తొమ్మిదిన పీఎంఎంఎస్‌ఏ కార్యక్రమాన్ని నిర్వహించి గర్భిణులకు మెరుగైన చికిత్సను అందిస్తున్నాం. లింగ నిర్ధారణ పరీక్షలపై సిబ్బంది సహకారంతో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నాం.

– కె.స్వర్ణలత, గైనకాలజిస్ట్, సీహెచ్‌సీ ఆలమూరు

బాధిత కుటుంబానికి ఆసరా



నూతన వస్త్రాలు అందిస్తున్న శ్రీనివాసరావు

సఖినేటిపల్లి: మండల పరిధిలోని పల్లిపాలెం గ్రామానికి చెందిన కామాడి దుర్గా ప్రసాద్ రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందాడు. ఈ మేరకు శనివారం రాఖీపౌర్ణమిని పురస్కరించుకుని బాధిత కుటుంబాన్ని ఆదివారం పీ4 కింద జిల్లా రవాణా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు దత్తత తీసుకున్నారు. ఇంటి వద్ద ఉంటున్న మృతుడి సోదరితో రక్షాబంధన్ కట్టించుకుని, నూతన వస్త్రాలను ఆయన అందజేశారు. ఏ ఇబ్బంది ఉన్నా తనకు వెంటనే తెలియజేయాలని కుటుంబ సభ్యులకు అధికారి సూచించారు.

చేనేత కళాకారుడి మృతి



పిచ్చుక పోలేశ్వరరావు (ఫైల్)

మామిడికుదురు: అప్పనపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ చేనేత కార్మికుడు పిచ్చుక పోలేశ్వరరావు (96) శనివారం మృతి చెందారు. 1953వ సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి సారి పోచంపల్లి డిజైన్లు, టై అండ్ డై వర్క్‌ను ఉమ్మడి రాష్ట్రానికి తీసుకువచ్చి అప్పనపల్లి కేంద్రంగా వందల కుటుంబాలకు జీవనోపాధి కల్పించారు. తద్వారా చేనేత రత్నం బిరుదును పొందారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.

క్లుప్తంగా

వైభవంగా శ్రీలక్ష్మీ హయగ్రీవ జయంతి



స్వామి పాదాల చెంతన ఉంచిన పెన్నులు

మామిడికుదురు: మామిడికుదురు శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీలక్ష్మీ హయగ్రీవ జయంతిని శనివారం వైభవంగా జరిపించారు. సుదర్శనం వెంకటసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, పంచామృతాలతో స్వామి వారికి అభిషేకాలను ఘనంగా జరిపించారు. 10 వేల పెన్నులతో ప్రత్యేక పూజ నిర్వహించి, పూజ అనంతరం పెన్నులను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమం ఆద్యంతం వైభవంగా జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

దొంగకు గ్రామస్తుల దేహశుద్ధి

మామిడికుదురు: తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగ తనం చేసి పట్టుబడ్డ దొంగకు దేహశుద్ధి చేసిన సంఘటన ఈదరాడ గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. కొబ్బరి కాయల వ్యాపారి లంకలపల్లి సూర్యనారాయణ వైద్య పరీక్షల కోసం ఇటీవల భార్యతో కలిసి హైదరాబాదు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరని తెలుసుకున్న పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలం పెనుమంచిలికి చెందిన మార్గని గోపాలకృష్ణ ఈ నెల 3వ తేదీన దొంగతనానికి పాల్పడ్డాడు. దొంగతనం చేసి పారిపోయే ప్రయత్నంలో అతను గ్రామస్థులకు పట్టుబడ్డాడు. ఈ నేపథ్యంలో స్థానికులు దేహశుద్ధి చేసి నగరం పోలీసులకు అప్పగించారు. అతని వద్ద నుంచి రూ.8 వేలు నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బాధితుడి అల్లుడు యెరుబండి గోవింద విజయరామ్మూర్తి ఫిర్యాదు మేరకు ఈ నెల 4వ తేదీన కేసు నమోదు చేశామని ఎస్సై ఎ.చైతన్యకుమార్ శనివారం తెలిపారు. నిందితుడిని కోర్టుకు తరలించగా రిమాండు విధించిందని పట్టుబడ్డ దొంగ పాత నేరస్థుడని పేర్కొన్నారు.

రక్షణగా నిలవాలి



శ్రీనివాసరావుకు రాఖీ కడుతున్న బ్రహ్మ కుమారి

మామిడికుదురు: పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావుకు బ్రహ్మ కుమారీస్ సేవా ట్రస్టు ప్రతినిధి శనివారం రాఖీ కట్టారు. అయినవిల్లిలోని ఆయన స్వగృహంలో రక్షా బంధన్ సందర్భంగా నుదుటున బొట్టు పెట్టి రాఖీ కట్టారు. అనంతరం స్వీటు తినిపించి ఆమెకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

రహదారి ఆక్రమణలను అడ్డుకోవాలి

రాజోలు: పొన్నమండ ఉన్నత పాఠశాలకు వెళ్లే రహదారిని గ్రామానికి చెందిన బొక్కా సత్తిబాబు అనే వ్యక్తి ఆక్రమణలకు పాల్పడుతున్నాడని గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్ అండ్‌బీరోడ్డు, హైస్కూల్‌కు వెళ్లే రహదారికి ఆనుకుని సత్తిబాబు నివాసగృహం ఉందని, రోడ్డు పక్కనే ఐరన్ మెటీరియల్స్, బోర్డులు పెట్టి రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. రోడ్డును అక్రమించి ప్రహరీ గోడ నిర్మాణం చేస్తున్నాడని దీనిపై పంచాయతీ సిబ్బంది విచారణ చేసి ఐరన్ మెటీరియల్స్, గోడను తొలగించాలని సూచనలు చేసినా వాటిని పట్టించుకోలేదని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో వివరించారు. చర్యలు తీసుకుని వాహనచోదకులు, విద్యార్థులు ప్రమాదాలకు గురికాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

శాస్త్రోక్తంగా శ్రవణా నక్షత్ర కల్యాణం

కొత్తపేట: పురాణ ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం ర్యాలి జగన్మోహినీ కేశవ, గోపాలస్వామివారి శ్రవణా నక్షత్ర మాస కల్యాణ మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో దేవస్థానం ఈఓ భాగవతుల వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు ఆధ్యాత్మిక వ్యాఖ్యానం నడుమ శాస్త్రోక్తంగా కళ్యాణం నిర్వహించారు. దేవస్థానం తరపున ఈఓ రమణమూర్తి, పలువురు భక్తులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ర్యాలి పరిసర గ్రామాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. తదుపరి మాస కళ్యాణం వచ్చే నెల 5న జరుగుతుందని ఈఓ తెలిపారు.

సంతోషిమాతకు పూజలు

కొత్తపేట: మండల పరిధిలోని వాడపాలెం గ్రామంలో వేంచేసియున్న సంతోషిమాత అమ్మవారి పుట్టినరోజు పురస్కరించుకుని శనివారం భక్తులు ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ బండారు లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు నిట్టల శివరామకృష్ణ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు కుంకుమ పూజలు జరిపారు. గ్రామానికి చెందిన భక్తురాలు గవర లక్ష్మి సంతోషిమాత నోము ఆచరించి, మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు వస్త్రాలు సమర్పించారు.

మార్కెట్ విస్తరణకు సహకరించాలి



మార్కెట్ అభివృద్ధిపై చర్చిస్తున్న ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్

మలికిపురం: మలికిపురం ఆదివారం మార్కెట్ అంటే పూర్వం నుంచి గొప్ప పేరు ఉండేదని ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్ అన్నారు. మార్కెట్ అభివద్ధి ప్రణాళికలో భాగంగా ఆయన శనివారం మార్కెట్‌ను పరిశీలించారు. రెండు ఎకరాల స్థలం ఉన్న, ప్రస్తుతం ఒక ఎకరాన్ని మాత్రమే ఉపయోగిస్తున్నారని, మార్కెట్ ఒక క్రమ పద్ధతిలో నిర్మాణం జరగలేదన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని అధునాతనంగా నిర్మాణం చేస్తామని, మలికిపురం రోడ్డును డబుల్ లైన్ చేయవలసిన అవశ్యకత ఉందని దానికి అందరూ సంసిద్ధంగా ఉండాలన్నారు. తద్వారా మార్కెట్ అభివృద్ధి చెందుతుందని ఆదాయంగా కూడా గణనీయంగా పెరుగుతుందన్నారు. ఆయన వెంట మార్కెట్ ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, జక్కంపూడి శ్రీదేవి,గెడ్డం తులసీ భాస్కరరావు, కార్యదర్శి తాడి ఏసుబాబు తదితరులు ఉన్నారు.

జాతీయ రహదారిపై అవస్థలు



రహదారిపై నిలిచిన వర్షపు నీరు

మామిడికుదురు: మండల వ్యాప్తంగా శనివారం భారీ వర్షం కురిసింది. గత పది రోజులుగా తీవ్రమైన వేడి, ఉక్కబోతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు భారీ వర్షంతో సేద తీరారు. గంట పాటు కురిసిన భారీ వర్షానికి పలుచోట్ల రోడ్లపై భారీగా ముంపు నీరు నిలిచిపోయింది. మామిడికుదురు, నగరం గ్రామాల్లో 216వ నెంబర్ జాతీయ రహదారిపై మూడడుగుల మేర వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బోయి భీమన్న మానవ వనరుల కేంద్రం, పాత పోలీస్ స్టేషన్ సమీపంలోను నీరు ఎటూ వెళ్లే మార్గం లేకపోవడంతో స్థానికులు, ప్రయాణీకులకు అవస్థలు తప్పడం లేదు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

నూతన ఆలయానికి జగ్గిరెడ్డి విరాళం



ఆలయ నిర్మాణానికి రూ. 50 వేలు అందజేస్తున్న జగ్గిరెడ్డి

రావులపాలెం: మండలంలోని వెదిరేశ్వరం గ్రామం బొక్కా వారిపాలెంలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ గణపతి ఆలయాన్ని శనివారం మాజీ ఎమ్మెల్యే, డాక్టర్.బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి దర్శించుకున్నారు. అనంతరం వేద పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి ఆలయ కమిటీ సభ్యులకు జగ్గిరెడ్డి రూ. 50 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వెదిరేశ్వరం గ్రామ సర్పంచ్ బొక్కా కరుణాకరం, సూరిబాబు రాజు, కర్రి నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్నను దర్శించిన ఎస్పీ



భక్తుల సౌకర్యాలపై అధికారులను ఆరా తీస్తున్న ఎస్పీ కృష్ణారావు

కొత్తపేట: వాడపల్లి వేంకటేశ్వర స్వామివారి క్షేత్రానికి వచ్చే ప్రతీ భక్తుడు సౌకర్యవంతంగా స్వామిని దర్శించుకుని సంతృప్తిగా తిరిగి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ బీ.కృష్ణారావు అధికారులకు సూచించారు. ఆయన శనివారం సాయంత్రం వాడపల్లి క్షేత్రాన్ని సందర్శించారు. దేవస్థానం, పోలీస్ అధికారులతో కలిసి క్షేత్రంలో పర్యటించి స్వామి దర్శనానికి ఏర్పాటు చేసిన క్యూలైన్లు, ప్రదక్షిణలకు ఆటంకం లేకుండా నిర్మించిన ఫ్లై ఓవర్లు, అన్నప్రసాద ప్రాంగణం, తలనీలాలు, గోదావరి స్నానఘట్టం, పార్కింగ్ తదితర ప్రదేశాలను పరిశీలించారు. పెరుగుతున్న భక్తుల సంఖ్యకు అనుగుణంగా అధికారులు తీసుకుంటున్న చర్యల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈఓ చక్రధరరావు ఎస్పీని స్వామివారి పట్టు వస్త్రంతో సత్కరించి, చిత్రపటాన్ని అందచేశారు. ఆయన వెంట కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఆత్రేయపురం, ఆలమూరు ఎస్సైలు రాము, నరేష్ తదితరులు ఉన్నారు.

వేడుకగా రక్షాబంధన్



సోదరులకు రాఖీ కడుతున్న సోదరి

కొత్తపేట: అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి పండుగను శనివారం ఊరూరా వేడుకగా జరుపుకున్నారు. అన్నా –చెల్లెళ్లు, అక్కా–తమ్ముళ్లు, సోదరసోదరీమణులు, స్నేహితులు, విద్యార్థినీ, విద్యార్థులు రాఖీ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఎక్కడ చూసినా రాఖీ సందడి కనిపించింది. సోదరులకు నుదుట తిలకం దిద్ది, రాఖీలు కట్టి, స్వీటు తినిపించి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుని తమకు అండగా, రక్షణగా నిలవాలని శుభాకాంక్షలు తెలియచేశారు.

అప్పనపల్లిలో భక్తజన కోలాహలం

మామిడికుదురు: బాల తిరుపతిగా పూజలందుకుంటున్న అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి వారి ఆలయానికి శనివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. పవిత్ర శ్రావణ మాసం, పౌర్ణమి శనివారం కావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తొలి హారతిని దర్శించుకున్న భక్తులు తన్మయత్వం చెందారు. అయిదు వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని, వివిధ సేవల ద్వారా స్వామి వారికి రూ.3,53,720 లక్షల ఆదాయం వచ్చిందని నిత్య అన్నదానం ట్రస్టుకు విరాళాలు రూపంలో రూ.1,01,912 లక్షలు సమకురిందని ఆలయ ఈఓ వి.సత్యనారాయణ తెలిపారు. మూడు వేల మంది స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారన్నారు.

మోసాలకు నిలువెత్తు నిదర్శనం చంద్రబాబు



కూటమి మోసాలను ప్రజలకు వివరిస్తున్న గొల్లపల్లి, తదితరులు

రాజోలు: అబద్ధపు హామీలు ఇచ్చి మోసాలకు నిలువెత్తు నిదర్శనంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నిలిచారని మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు ధ్వజమెత్తారు. శనివారం శివకోటి, రాజోలు, పొదలాడ, తాటిపాక గ్రామాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా శివకోటి గ్రామ సర్పంచ్ నక్కా రామారావు, గ్రామశాఖ అధ్యక్షుడు పితాని నాగరాజుస్వామి ఆధ్వర్యంలో స్థానిక లాకు సెంటరు వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజోలులో సర్పంచ్ రేవు జ్యోతి, గ్రామశాఖ అధ్యక్షుడు అడబాల జానకీరామ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకుడు గొల్ల చిన్ని ఇంటి వద్ద, అనంతరం పొదలాడలో గ్రామశాఖ అధ్యక్షుడు దొమ్మేటి సోమరాజు, కొల్లాబత్తుల సతీష్‌బాబు ఆధ్వర్యంలో సెంటరులో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి పార్టీ పతకాలని ఆవిష్కరించారు. చంద్రబాబు మోసాలను ప్రజలు గమనిస్తున్నారని, బాబు మోసాలను ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచి వివరించారు. క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా బాబు మోసాలతో ఏ విధంగా నష్టపోయామనే విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సబ్యురాలు మట్టా శైలజ, రాజోలు, మండపేట పరిశీలకులు మట్టపర్తి నాగేంద్ర, కటకంశెట్టి ఆదిత్య, జిల్లా ఉపాధ్యక్షుడు కూపనరెడ్డి రాంబాబు, ప్రచార విద్యార్థి విభాగాల అధికార ప్రతినిధులు తెన్నేటి కిషోర్, తాడి సహదేవ్, మోకా సురేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ గెద్దాడ సత్యనారాయణ, గుబ్బల మనోర్, కొల్లాబత్తుల సతీష్‌బాబు, గుర్రం జాషువా, దాసు, మట్టా ఏడుకొండలు, బొద్దపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహేష్‌బాబు అభిమానుల రక్తదానం



రక్తదానం చేస్తున్న మహేష్‌బాబు అభిమానులు

కొత్తపేట: మహేష్‌బాబు పుట్టినరోజు పురస్కరించుకుని శనివారం స్థానిక గౌతమినగర్ మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో బ్లడ్ స్టోరేజ్ సెంటర్, అమలాపురం ఏరియా ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్సై వెంకటేశ్వరరావు, ఎస్ఎఫ్ఓ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. సినీనటుల అభిమాన సంఘాలు అందరూ సోదరభావంతో ఉంటూ, సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆదర్శనీయమన్నారు. ఈ సంస్కృతి సమాజంలో ఆరోగ్యకరమైన వాతావరణమన్నారు. అందరూ కలసిమెలసి ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం సుమారు 30 మంది అభిమానులు రక్తదానం చేశారు.

మహేష్ బాబు పుట్టిన రోజు వేడుకలు

మలికిపురం: సూపర్ స్టార్ మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా స్థానిక వేణుగోపాల థియేటర్ ఆవరణలో కేక్ కట్ చేసి అభిమానులు వేడుకలు చేసుకున్నారు. అనంతరం విశేషరాయపురం వృద్ధాశ్రమంలోని వృద్ధులతో కలిసి కేక్ కట్ చేసి వారికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సేవా కార్యక్రమంలో అభిమానుల సంఘం అధ్యక్షుడు గోగనమఠం శ్రీనివాసరావు సెక్రటరీ నేతల శ్రీను, జి.నందు, జానీ, బన్నీ పలువురు అభిమానులు పాల్గొన్నారు.

అభిమాన సంఘాలు సేవలు అందించాలి

పి.గన్నవరం: సినీ హీరోల అభిమాన సంఘాలు సమాజానికి తమవంతు సేవలు అందించాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. శనివారం మహేష్ బాబు జన్మదిన దినోత్సవాన్ని పురస్కరించుకుని పోతవరం పెట్రోల్ బంకు, మూడు రోడ్ల జంక్షన్ వద్ద అభిమానుల సంఘం ఆధ్వర్యంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు అభిమానులు రక్త దానం చేశారు. పేదలకు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మహేష్‌బాబు ఫౌండేషన్ ద్వారా ఇటీవల ఉచితంగా గుండె ఆపరేషన్ చేయించుకున్న అనగార్లంకకు చెందిన చిన్నారి గురు లతాశ్రీ బర్త్ డే కేకును కట్ చేసింది. ఈ కార్యక్రమంలో యన్నాబత్తుల ఆనంద్, సేవాసమితి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

మహేష్‌బాబును ఆదర్శంగా తీసుకోవాలి

అంబాజీపేట: అంబాజీపేటలో మహేష్‌బాబు ఫ్యాన్స్ ఆధ్వర్యంలో పుట్టిన రోజు వేడుకలను శనివారం నిర్వహించారు. ప్రజలకు, సమాజానికి, మార్గదర్శిగా నిలవడమే కాకుండా 3వేల మందికి పైగా గుండె ఆపరేషన్‌లు చేయించిన సూపర్‌స్టార్ హీరో మహేష్‌బాబు అందరికి ఆదర్శ ప్రాయుడిగా నిలిచాడని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఫ్యాన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 100 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, శెట్టి, రాయుడు పాల్గొన్నారు.

ఎంపీటీసీకి నాయకుల పరామర్శ

మామిడికుదురు: భార్య వియోగంతో బాధపడుతున్న లూటుకుర్రు ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు కుటుంబాన్ని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ శనివారం పరామర్శించారు. ఎంపీటీసీ భార్య పద్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె చిత్రపటం వద్ద ఎమ్మెల్యే పుష్పాలతో నివాళులర్పించారు. ఎంపీటీసీ భార్య పద్మ మృతి చెందడం బాధాకరమన్నారు. ఎంపీటీసీని పరామర్శించిన వారిలో నగరం ఏఎంసీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, సర్పంచ్ అడబాల తాతకాపు, కూటమి నేతలు బోణం బాబు, మద్దాల కృష్ణమూర్తి, జాలెం శ్రీనివాసరాజు, రజ్వీ, గాలిదేవర దేవి తదితరులు ఉన్నారు.

నేడు మూడు గ్రామాల్లో రచ్చబండ

అంబాజీపేట: మండల పరిధిలోని మూడు గ్రామాల్లో ఆదివారం ‘బాబు షూరిటీ–మోసం గ్యారంటీ’ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. మాచవరం సచివాలయం 2, 3, మొసలపల్లి, ఇరుసుమండ గ్రామాల్లో కార్యక్రమాన్ని నిర్వహిస్తారని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ అనుభంద విభాగాల నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వ్యక్తిపై కేసు నమోదు

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై శనివారం కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ కె.తిరుపతిరాజు ఓ ప్రకటనలో తెలిపారు. చినపేటకు చెందిన రాకాపు వెంకటరెడ్డిని అదే గ్రామానికి చెందిన రాకాపు కార్తిక్ అకారణంగా కొట్టాడంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ వెల్లడించారు.

కిటకిటలాడిన వేంకటేశ్వర స్వామి ఆలయాలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. దీంతో చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్శిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామఃస్మరణతో మారుమ్రోగాయి.

జనార్దన స్వామికి మారేడు దళాలతో పూజ

ఆలమూరు: మండల కేంద్రం ఆలమూరులో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత జనార్దన స్వామి ఆలయంలో శనివారం మారేడు దళాలు, వెండి పువ్వులతో పూజాలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు ప్రభాకరాచార్యులు వేద మంత్రోచ్ఛరణల మధ్య పురోహితులు పూజలు నిర్వహించారు.